


నేటి నుంచి చంద్రబాబు ప్రజాగళం

రావులపాలెం, రామచంద్రపురంలలో బహిరంగ సభలు

రేపు కొవ్వూరు, గోపాలపురంలలో..

అమలాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా తొలిసారిగా టీడీపీ ఎన్నికల శంఖారావాన్ని పూరించనుంది. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం కొత్తపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో ప్రజాగళం పేరుతో ఎన్నికల సభల్లో పాల్గొననున్నారు. కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని రావులపాలెం, రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలోని ద్రాక్షారామ బహిరంగ సభలకు అశేష జనవాహినిని తరలించేందుకు టీడీపీ కూటమి శ్రేణులు కృషి చేస్తున్నాయి. ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న టీడీపీ నేతలు జన సమీకరణకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా టీడీపీ జోన్-2 ఇన్‌చార్జి సుజయ కృష్ణ రంగారావు, పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, అమలాపురం లోక్‌సభ అభ్యర్థి గంటి హరీశ్‌మాధుర్, కొత్తపేట, రామచంద్రపురం అసెంబ్లీల టీడీపీ అభ్యర్థులు బండారు సత్యానందరావు, వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో చంద్రబాబు పర్యటన ఏర్పాట్లపై మంగళవారం సమీక్షించారు. కొత్తపేటలో జరిగిన సమావేశంలో చంద్రబాబు సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ శ్రేణులకు నిర్వాహకులు దిశానిర్దేశం చేశారు. రావులపాలెం సెంటర్లోని కెనాల్ రోడ్డులోను, ద్రాక్షారామలోని బోసుబొమ్మ సెంటర్ మూడు రోడ్ల కూడలిలో సభల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. చంద్రబాబు పర్యటన ద్వారా కోనసీమ జిల్లాలో కూటమి కేడర్‌లో జోష్ పెరగనుంది.

పర్యటన ఇలా..

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం అధినేత చంద్రబాబు బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లో బయలుదేరి 1.20కు బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కి వస్తారు. 2.30 గంటలకు రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్ట్‌కి వస్తారు. 2.50కు హెలికాప్టర్‌లో బయలుదేరి అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రావులపాలెం మండలం పరిధిలోని ఈతకోట గ్రామ సమీపంలోని మల్లయ్యదొడ్డి వద్ద హెలిపాడ్‌కు చేరుకుని అక్కడ నుంచి రావులపాలెం టీడీపీ ఆఫీస్ సెంటర్‌కు చేరుకుంటారు. సాయంత్రం 3.30 నుంచి 5 వరకు బహిరంగసభలో పాల్గొంటారు. 5.15కు రోడ్డు మార్గంలో బయలుదేరి రామచంద్రపురం మండలం ద్రాక్షారామలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం దగ్గరకు చేరుకుంటారు. అక్కడ రాత్రి 7 గంటల నుంచి 8.30 వరకు బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం 8.45కు రోడ్డు మార్గాన బయలుదేరి రామచంద్రపురం వీఎస్ఎమ్ కాలేజీకి చేరుకుంటారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. 4న 10.25కు రోడ్డు మార్గన బయలుదేరి వీఎస్ఎమ్ కాలేజీ గ్రౌండ్‌లో 10.30 నుంచి 1 వరకు జరిగే సభలో పాల్గొంటారు. భోజనం విరామం తర్వాత 2 గంటలకు రామచంద్రపురం 16 వార్డులోని కోరుకొండ రామకృష్ణ లే అవుట్ హెలిపాడ్‌కు చేరుకుని అక్కడ నుంచి హెలికాప్టర్‌లో కొవ్వూరులోని జరిగే బహిరంగ సభకు వెళతారు. అనంతరం రాత్రి నల్లజర్లలో జరిగే సభలో బాబు పాల్గొంటారు.



మీ మావయ్య వచ్చాడు : చిన్నారిని భుజంపై ఎత్తుకుని నడుస్తున్న పవన్..పట్టరాని ఆనందంలో బాలిక తల్లి



మరువం సార్ : చర్చిలో పవన్‌కు పాస్టర్స్ సన్మానం



దర్గాలో ప్రార్థనలు

అదిరిన రోడ్ షో

జనం జేజేలు



హత్తుకున్న..అభిమానం.. దగ్గరైన దూరం : పిఠాపురాన మహిళను ఓదార్చుతున్న పవన్

మీ బాగు కోసమే వస్తున్నా : రైతుతో పవన్ మాటామంతీ



యు.కొత్తపల్లిలో పవన్‌కు జ్ఞాపిక

మిమ్మల్ని నా గుండెల్లో పెట్టుకుని చూసుకుంటా..

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)/ పిఠాపురం/యు.కొత్తపల్లి: మండుటెండలోను ఆప్యాయ పలకరింపులు.. దారిపొడవునా అభివాదాలు.. రైతులతో ముచ్చట్లు.. గ్రామస్తులతో మాటామంతీలు..మహిళలతో సరదా స్టెప్పులు.. విద్యార్థులతో సెల్ఫీలు.. కలవడానికి వేచిచూస్తున్న ప్రతి ఒక్కరిని చూసి చిరునవ్వులు.. కారు ఆపి యోగక్షేమాల ఆరాలు.. కష్టాల్లో ఉన్నామని కలవడానికి వచ్చిన దివ్యాంగులకు ధైర్యవచనాలు.. ఇలా జనసేనాని జనం బాటపట్టారు. మీ చెంతకే వస్తున్నానంటూ సామాన్య నాయకుడి మాదిరి వెళ్లి కలిశారు.. దీంతో జనసేన అధినేత, పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పవన్ కల్యాణ్ నాలుగో రోజు పర్యటన సూపర్ హిట్ అయింది. ఆరున్నర గంటలపాటు సుమారు 30 కిలోమీటర్ల మేర మంగళవారం పవన్ నిర్వహించిన భారీ రోడ్ షోకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా హారతులు పట్టారు.. పూలవాన కురిపించారు. వీరందరికీ పవన్ అభివాదం చేస్తూ నిర్విరామంగా రోడ్డుషో నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన రోడ్‌షో సాయంత్రం 4.30 గంటలకు ముగిసింది. గోకులం గ్రాండ్ హోటల్‌లో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కూటమి పార్టీల నాయకులు, నియోజకవర్గ నేతలతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. గొల్లప్రోలు హెలిప్యాడ్ నుంచి మంగళవారం రాత్రి పవన్ రోడ్డుమార్గాన రాజమహేంద్రవరం విమానాశ్రయానికి వెళ్లి అక్కడి నుంచి అమరావతికి బయలుదేరారు. మరోపక్క మంగళవారంతో పవన్ నాలుగురోజుల పిఠాపురం పర్యటన ముగిసింది. తిరిగి 8న రానున్నారు.

- పిఠాపురంలో పవన్‌కు బ్రహ్మరథం
- 30 కి.మీ. మేర మండుటెండలో రోడ్‌షో
- ఆరున్నరగంటలపాటు ఏకధాటిగా..
- దారిపొడవునా నీరాజనం
- ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ ముందుకు..
- కొత్తపల్లిలో సమావేశం అడ్డగింత
- నులకమంచంపై కూర్చుని మాటామంతీ
- మూలపేటలో సరదాగా స్టెప్పులు
- పెరిగిన పోలీసు బందోబస్తు
- ముగిసిన జనసేనాని పర్యటన.. మళ్లీ 8న రాక



వే..ఆటోవాన్ని : ఆటో డ్రైవర్‌తో పవన్

ఏమ్మా.. నేను మీ తమ్ముడిని.. నేలపై కూర్చుని పలకరింపు



పట్టలేని ఆనందం.. పవన్ పలకరింపుతో పులకింత

48 గంటల ముందే దరఖాస్తు.. అయిననూ అనుమతిలేదు..

యు.కొత్తపల్లి సురక్ష ఫంక్షన్ హాలులో ఉప్పాడ, కొత్తపల్లి, వాకతిప్ప, కొండెవరం తదితర గ్రామాలకు చెందిన జనసేన వీరమహిళలతో పవన్‌కల్యాణ్ సమావేశం ఏర్పాటు చేశారు. కాసేపట్లో పవన్ ప్రసంగిస్తారనగా ఎన్నికల అధికారులు అడ్డంకులు కల్పించారు. 48 గంటల ముందే జనసేన వర్గాలు సమావేశం అనుమతికి దరఖాస్తు చేశారు. రోడ్‌షోకు, ఇతర సమావేశాలకు అనుమతిచ్చారు. కానీ కొత్తపల్లి సమావేశానికి అనుమతి లేదని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వచ్చి చెప్పారు. పవన్ కల్యాణ్ అధికారులతో చర్చించిన తర్వాత సమావేశం రద్దుకు జనసేన నిర్ణయించింది. చివరకు ఐదు నిమిషాలు మాట్లాడి సమావేశాన్ని ముగించారు. పిఠాపురం తన స్వస్థలమని.. తాను ఇక్కడే ఉంటానన్నారు. త్వరలో సమావేశం నిర్వహించి అందరి కష్టాలు వింటానని మాటిచ్చారు.

వెల్లువెత్తిన.. అభిమాన పవనాలు

పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న పవన్ తొలిసారిగా ఆరున్నర గంటలపాటు ఏకబిగిన 30 కిలోమీటర్ల మేర రోడ్డుషో నిర్వహించారు. మండుటెండలో సైతం ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పలికారు. కిలోమీటర్ల కొద్దీ ప్రజలు బారులు తీరారు. తమ అభిమాన నేతను చూసేందుకు గంటల తరబడి ఎదురుచూశారు. హైదరాబాదు నుంచి గొల్లప్రోలులోని హెలిప్యాడ్‌లో ఉదయం 9.50 గంటలకు దిగిన పవన్‌కల్యాణ్ నేరుగా పిఠాపురం పట్టణం చేరుకుని పశువుల సంత నుంచి రోడ్ షో ప్రారంభించారు. అగ్రహారం, ఆర్టీసీ కాంప్లెక్స్, మెయిన్‌రోడ్డు మీదుగా ఆంధ్రా బాప్టిస్టు సెంటినరీ చర్చికి చేరుకుని అక్కడ ప్రార్థనలు చేశారు. బైబిల్ సూక్తులు అంటే తనకు ఎంతో ఇష్టమన్నారు. తన భార్య క్రిస్టియన్ అని గుర్తుచేశారు. చర్చిలో ఒక మహిళ తన కష్టాలను పవన్‌కల్యాణ్‌కు విన్నవించింది. ఆమెకు అండగా ఉంటానని పవన్ భరోసా ఇచ్చారు. కొందరు అభిమానులు పవన్‌కు టీగ్లాస్ సెట్ బహుమతిగా అందించారు. అక్కడ నుంచి బయలుదేరి మాధవపురం, ఉప్పరగూడెం, నాగులాపల్లి గ్రామాల మీదుగా పవన్ మధ్యాహ్నం 12 గంటలకు పొన్నాడ చేరుకున్నారు. పొన్నాడ వీధుల్లో నడుచుకుంటూ బషీర్‌బీబీ ఔలియా(బంగారుపాప) దర్గాకు చేరుకున్నారు. మార్గ మధ్యలో కొబ్బరిబొండాలు అమ్మే వ్యక్తితో మాట్లాడారు. పొన్నాడలో ఓ ఇంటి వద్ద నులకమంచంపై కూర్చుని ముచ్చటించారు. అక్కడే నాగులాపల్లికి చెందిన కొత్త జంట పెళ్లి వస్త్రాల్లోనే పవన్ వద్దకు వచ్చి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం బషీర్‌బీబీ దర్గాలో ప్రార్థనలు చేశారు. చాదర్ వస్త్రాలు సమర్పించారు. అనంతరం మూలపేట జంక్షన్, బీచ్‌రోడ్డు, అమీనాబాదు, ఉప్పాడ గ్రామాల మీదుగా కొత్తపల్లి చేరుకున్నారు. దారి పొడవునా ప్రజలు అపూర్వ రీతిన స్వాగతం పలికారు. వారందరికి కారు ఓపెన్‌టాపు నుంచి అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు. పలుచోట్ల కారుని ఆపి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. వాకతిప్ప, యండపల్లి జంక్షన్ల మీదుగా కొండెవరం చేరుకున్నారు. అక్కడ ప్రజలు భారీగా తరలిరావడంతో కారు దిగి గ్రామంలో నడిచారు. మహిళలతో స్టెప్పులు వేశారు. చిన్నారులు పవన్‌ను అలింగనం చేసుకున్నారు. నవఖండ్రవాడ మీదుగా పిఠాపురంలోని డ్రైవర్స్‌కాలనీకి చేరుకున్నారు. అక్కడ పలుచోట్ల కారు ఆపి కిందకు దిగి వివిధ వర్గాల ప్రజలతో మాట్లాడారు. మండుటెండలో తిరుగుతున్న పవన్‌కు రైతులు కొబ్బరిబొండాలు అందించారు. ఉప్పాడ రైల్వేగేటు, బంగారమ్మరావిచెట్టు సెంటర్, సినిమా సెంటర్, పాతబస్టాండు, అంబేడ్కర్ సెంటర్, ప్రభుత్వాసుపత్రి సెంటర్, పోలీస్‌స్టేషన్, పాదగయ సెంటర్, జగ్గయ్యచెరువు కాలనీ మీదుగా కుమారపురం చేరుకున్నారు. గ్రామంలో రోడ్ షో నిర్వహించి తాను బస చేసే గోకులం గ్రాండ్‌కు చేరారు. తన సొంత నియోజకవర్గం పిఠాపురం నుంచే గత నెల 30న పవన్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టి మంగళవారం ముగించారు. పవన్ తొలివిడత నాలుగు రోజుల పర్యటనతో జనసేనతోపాటు టీడీపీ, బీజేపీ వర్గాల్లో జోష్ నెలకొంది.



పవన్ వెంట : పవన్‌తో నాగబాబు, సుజనా చౌదరి, వర్మ, గిరీష్, కామినేని శ్రీనివాస్, చినరాజప్ప తదితరులు



ఆనంద కల్యాణం : పిఠాపురంలో నూతన జంటకు శుభాకాంక్షలు చెబుతున్న పవన్

పెరిగిన బందోబస్తు..

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ మంగళవారం నాటి పర్యటనకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అభిమానుల ముసుగులో కొందరు కిరాయి మూకలు వచ్చి సన్నని బ్లేడుతో తనను, తన సెక్యూరిటీని కోస్తున్నారని, ప్రత్యర్థి పార్టీ పన్నాగాలు తెలుసుకదా అంటూ సోమవారం జరిగిన సమావేశంలో పవన్ సంచలన వాఖ్యలు చేశారు, ఈ నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటుచేశారు. ఇద్దరు డీఎస్పీలతోపాటు పలువురు సీఐలు, ఎస్ఐలను బందోబస్తు నిమిత్తం వినియోగించారు.

14 అంశాలతో..పిఠాపురం మేనిఫెస్టో..

పిఠాపురం, ఏప్రిల్ 2: పిఠాపురం నియోజకవర్గంలో ప్రచారం నిమిత్తం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ రూపొందించిన కరపత్రాలను జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆవిష్కరించారు. పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌లో మంగళవారం రాత్రి పవన్ చేబ్రోలు బహిరంగసభలో పిఠాపురం అభివృద్ధికి ప్రకటించిన 14 అంశాల మేనిఫెస్టో, వర్మ ఇస్తున్న హామీలతో రూపొందించిన కరపత్రం ఆవిష్కరించారు. ఇదే కరపత్రంలో తాను ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధి, 18 సంవత్సరాల్లో చేసిన సేవా కార్యక్రమాలను వర్మ పొందుపరిచారు. పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ పిఠాపురాన్ని స్వస్థలంగా చేసుకుని, ప్రతి సమస్యను నా సమస్యగా భావించి పరిష్కరించే బాధ్యతను తీసుకుంటానని తెలిపారు. బుధవారం నుంచే ఇంటింటి ప్రచారం ప్రారంభిస్తామని.. ప్రతి ఓటరుకు కరపత్రాన్ని అందిస్తామని వర్మ తెలిపారు.



ఇదీ నా విజన్ : పిఠాపురంలో కరపత్రాలను విడుదల చేస్తున్న పవన్‌కల్యాణ్, వర్మ

వైసీపీ ప్రచార సామగ్రితో ఉన్న వాహనం నిలుపుదల

అడ్డుకున్న బీజేపీ, జనసేన నాయకులపై దాడికి పాల్పడ్డ వైసీపీ నాయకులు

ఎట్టకేలకు కేసు నమోదు



నాయకుల మధ్య ఘర్షణను అడ్డుకుంటున్న పోలీసులు

సర్పవరం జంక్షన్(కాకినాడ), ఏప్రిల్2: కాకినాడ రూరల్ నియోజకవర్గంలో వైసీపీ నాయకులు రెచ్చిపోయారు. వైసీపీకి చెందిన ప్రచార సామగ్రితో ఓ అపార్టుమెంట్ వద్ద ఆగి ఉన్న వాహనాన్ని బీజేపీ, జనసేన నాయకులు ప్రశ్నించడంతో వైసీపీ నాయకులు దాడికి పాల్పడిన తతంగాన్ని వీడియో తీస్తున్న టీవీ5 కెమెరామెన్ కెమెరా లాక్కుని దాడికి పాల్పడ్డారు. మంగళవారం రాత్రి కాకినాడ 2వ డివిజన్ శశికాంత్‌నగర్‌లో బీజేపీకి చెందిన నాయకులు జనసేన కాకినాడ రూరల్ అభ్యర్థి పంతం నానాజీకి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అక్కడే ఓ అపార్టుమెంట్ ఎదుట రెండు వాహనాలు రావడం, అందులో వైసీపీకి చెందిన ప్రచార సామగ్రితోపాటు ఇతర వస్తువులు ఉన్నట్టు అనుమానంతో సీ విజిల్ యాప్‌లో ఎన్నికల సంఘం అధికారులకు ఫిర్యాదు చేశారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇట్ల కిషోర్ ఆదేశాల మేరకు మొబైల్ ఫ్లయింగ్ స్క్వాడ్‌ని పంపించడంతో బీజేపీ, జనసేన, వైసీపీకి చెందిన తలో ఇద్దరు ప్రతినిధులను అపార్టుమెంట్‌లో పరిశీలించేందుకు అనుమతించారు. పరిశీలన అనంతరం బయటకు వస్తున్న ప్రతిపక్ష పార్టీ ప్రతినిధులపై వైసీపీకి చెందిన నాయకులు దాడికి పాల్పడ్డారు. అక్కడే ఉన్న టీవీ 5 కెమెరామెన్ ప్రవీణ్ గుప్తాతోపాటు మరొక చానల్ సిబ్బంది శ్రీధర్‌లపై దాడికి పాల్పడ్డారు. సర్పవరం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ వచ్చి సర్దిచెప్పి పంపించారు. సమాచారం తెలుసుకున్న పంతం నానాజీ అనుచరులతో వచ్చి దాడికి పాల్పడ్డ వారిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఆందోళన చేపట్టారు. ఎస్‌డీపీవో హనుమంతరావు వచ్చి నానాజీతో మాట్లాడి వైసీపీ నాయకులపై కేసు నమోదుకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. పార్టీ సెంట్రల్ కార్యాలయం నుంచి నియోజకవర్గాలకు చెందిన ప్రచార సామగ్రి వచ్చిందని, ఇన్‌వాయిస్‌లు ఉన్నట్టు చెబుతున్నారు.



పిఠాపురంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్న వైసీపీ ఎన్నికల ప్రచార సామగ్రి ఉన్న వాహనం

వైసీపీ ఎన్నికల ప్రచార సామగ్రి స్వాధీనం

తరలిస్తున్న వాహనం సీజ్ చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి

దళారుల ప్రమేయం లేకుండా ధాన్యం కొనుగోలు : జేసీ

కలెక్టరేట్(కాకినాడ),ఏప్రిల్2: రబీ ధాన్యం కొనుగోలులో దళారుల ప్రమేయం లేకుండా చూడాలనీ, రైతుల నుంచే నేరుగా ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్ వివేకానంద సమావేశ మందిరంలో మంగళవారం రెవెన్యూ, వ్యవసాయశాఖ, పౌరసరఫరాలశాఖ అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రబీ సీజన్‌లో ధాన్యం కనీస మద్దతు ధర ప్రకారం సేకరించాలన్నారు. ధాన్యం విక్రయించిన ప్రతి రైతు వేలిముద్రలు తప్పనిసరిగా సేకరించాలన్నారు. గ్రామ, మండల స్థాయిలో కోతలను అనుసరించి ప్రణాళిక ప్రకారం గోనులను ఏర్పాటుచేసుకోవాలన్నారు. ధాన్యం రవాణా చేసే వాహనాలకు జీపీఎస్ అమర్చాలని కోరారు. బహిరంగ మార్కెట్‌లో ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ధాన్యం సేకరణలో ఎన్నికల నియమావళి అనుసరించాలన్నారు. రెండురోజుల్లో మండల స్థాయిలో శిక్షణా తరగతులను నిర్వహించాలన్నారు. జిల్లా పౌరసరఫరాల మేనేజర్ బాలసరస్వతి, వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్‌తో కలిసి రాజీనామా ప్రకటన చేస్తున్న వలంటీర్లు

వలంటీర్ల రాజీడ్రామాలు!

రౌతులపూడి, ఏప్రిల్ 2: వలంటీర్లు వైసీపీకి చెందినవారే అనేది గుమ్మరేగుల గ్రామానికి చెందిన వలంటీర్ల రాజీనామా వ్యవహారంతో మరోసారి రుజువైంది. ఆరుగురు వలంటీర్లు రాజీనామా ఇవ్వడానికి మండల పరిషత్ కార్యాలయానికి సోమవారం వచ్చారు. రాజీనామా పత్రాలు అందజేశారు. అయితే వీరంతా గుమ్మరేగుల సర్పంచ్ వైసీపీ నాయకుడు రాపర్తి రామకృష్ణను వెంటతీసుకుని వచ్చి రాజీనామా పత్రాలు అందజేశారు. వలంటీర్ పసగడుగుల నాగలక్ష్మికి బదులు భర్త సత్తిబాబు రాజీనామా పత్రాలు అందజేసినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. రాజీనామా చేసిన వలంటీర్లంతా మండల పరిషత్ కార్యాలయం వద్ద సర్పంచ్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడగా ఒక వలంటీర్ భర్త ప్రసంగాన్ని ఇచ్చారు. ఇదంతా కేవలం వైసీపీ ఆడిస్తున్న రాజకీయ రాజీనామాలు కాగా, సర్పంచ్‌తో కలిసి రాజీనామాలు చేయడం, మీడియా సమావేశంలో మాట్లాడిన తీరుతో వలంటీర్ల రాజీనామా బాగోతం బయట పడుతోందని పలువురు వ్యాఖ్యానించడం గమనార్హం.

పెన్షన్లకు టెన్షనెందుకు



ఉందిగా సచివాలయ వ్యవస్థ

వైసీపీ నేతలు వలంటీర్లను తమ స్వప్రయోజనాలకు వినియోగించడంతో అందిన ఫిర్యాదుల మేరకు ఎన్నికల కమిషన్ వారిని పలు విధుల నుంచి తొలగించింది. ఈ నెల వారు పింఛన్లు ఇవ్వడానికి అవకాశం లేదు. దీంతో పింఛన్ల పంపిణీపై లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. ఈ పరిస్థితికి పరోక్షంగా, ప్రత్యక్షంగా జగన్ ప్రభుత్వమే కారణమనడంలో సందేహం లేదు. అయితే సచివాలయ సిబ్బందితో పంపిణీ చేయించే వెసులుబాటు ఉండడంతో ఇబ్బంది ఉండదని అధికారులు చెబుతున్నారు. ఐదేళ్లుగా వలంటీర్లను ఇళ్లకు పంపించి పింఛన్లు బట్వాడా చేశారు. ఇప్పుడు ఎన్నికల సంఘం ఆదేశాలతో వాళ్లు పింఛన్లు ఇవ్వడానికి వీల్లేదు. దీంతో సచివాలయ సిబ్బందిని సిద్ధం చేస్తున్నారు.

- ఇంటింటికీ పింఛను పంపిణీ సులువే
- జిల్లాల్లో భారీ సంఖ్యలో సచివాలయ ఉద్యోగులు
- వారు తలుచుకుంటే నాలుగైదు రోజుల్లో పని పూర్తి
- అధికారులు ఆదేశాలివ్వడమే తరువాయి
- 6వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ!
- నేడు పింఛన్ల పంపిణీ డౌటే..
- బ్యాంకులకు చేరని డబ్బు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి):

తూర్పుగోదావరి జిల్లాలోని అనపర్తి, బిక్కవోలు, చాగల్లు, దేవరపల్లి, గోకవరం, గోపాలపురం, కడియం, కోరుకొండ, కొవ్వూరు అర్బన్, రూరల్, నల్లజర్ల, నిడదవోలు అర్బన్, రూరల్, పెరవలి, రాజమహేంద్రవరం అర్బన్, రూరల్, రాజానగరం, రంగంపేట, సీతానగరం, తాళ్లపూడి, ఉండ్రాజవరం మండలాల్లో అభయహస్తం 5809, అమరావతి ల్యాండ్‌లెస్ పూర్ 3, సీకేడీయూ ప్రభుత్వ 186, ప్రైవేటు 261, డప్పు కళాకారులు 749, దివ్యాంగ 33194, డీఎంహెచ్‌వో సంబంధిత 1831, ఫిషర్‌మెన్ 1932, ఓఏపీ 121658, కళాకారులకు 154, సైనిక సంక్షేమ 18, ఒంటరి మహిళ 9149, కల్లుగీత కార్మికులు 2488, చర్మకారులు 858, ట్రాన్స్‌జెండర్లు 61, నేతకారులు 1338, వితంతు 65041 కలిపి మొత్తం 2,44,730 మంది పింఛను లబ్ధిదారులు ఉన్నారు. జిల్లాలోని 512 సచివాలయాల్లో 4944 మంది ఉద్యోగులు ఉన్నారు. మొత్తం పింఛన్లను సచివాలయ సిబ్బందికి విభజిస్తే ఒక్కొక్కరు రోజుకు సరాసరి 80 పింఛన్లు పంపిణీ చేయాల్సి వస్తుంది. ఈ నెల 3(నేడు) నుంచి 8వ తేదీ వరకూ పింఛన్లు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆరు రోజుల్లో 3వ తేదీన బ్యాంకుల నుంచి సచివాలయ సిబ్బంది డబ్బులు డ్రా చేయడం, ట్యాబ్‌లలో యాప్ తదితర ప్రక్రియ చూసుకున్నా.. 4 నుంచి 8 వరకూ ఐదు రోజుల్లో పింఛన్లు బట్వాడా చేయాల్సి ఉంటుంది. రోజుకు ఒక్కొక్కరు సరాసరి 20 పంపిణీ చేసినా ఐదు రోజుల్లో పూర్తవుతాయని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. వలంటీర్లు లేకపోయినా పింఛన్ల పంపిణీలో ఇబ్బందులు వచ్చే అవకాశం లేదని చెబుతున్నారు.

వలంటీర్లను వంచించి..

దేశంలో ఎక్కడా లేని విధంగా స్వలబ్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం యువత జీవితాలతో ఆటలాడుకొంది. ఐదేళ్ల కాలంలో ప్రభుత్వ ఉద్యోగాలకు ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. వలంటీరు వ్యవస్థను తెరపైకి తీసుకొచ్చింది. ఎప్పటికైనా జీవితాలు బాగుంటాయనే ఉద్దేశంతో పీజీలు చదివిన వాళ్లు కూడా నెలకు కేవలం రూ.5 వేలు ఇచ్చే ఉద్యోగానికి తలొగ్గక తప్పలేదు. తీరా ఉద్యోగంలో చేరిన తర్వాత స్పష్టమైన విధులు(జాబ్ చార్టు) లేకుండా ఇష్టానుసారం ఊడిగం చేయించుకున్నారు. చివరికి వైసీపీ సభలకు జనాలను తరలించే బాధ్యత కూడా వారికే అప్పజెప్పారు. వలంటీరు అంటే సేవకులని, వారిది ఉద్యోగం కాదని చాలా సందర్భాల్లో వైసీపీ నాయకులు చెప్పుకొచ్చారు. జగన్ కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. అయితే ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ తమ సైన్యమంటూ జగన్ ఊదరగొట్టారు. చివరికి ఎన్నికల సంఘం ఆదేశాలతో వారిని పింఛన్ల పంపిణీకి సైతం పక్కన పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. ముందు నుంచీ అటు ప్రజా ప్రతినిధులు, ఇటు అధికారుల నుంచి ఒత్తిడి భరిస్తూ ఉద్యోగాలను(సేవ)ను నెట్టుకొచ్చారు. కానీ అడుగడుగునా అవమానాలే ఎదురయ్యాయి. వెనుదిరిగి చూస్తే వలంటీరు పేరుతో యువత చేసిన ఊడిగం తప్ప.. వారికి జరిగిన మేలు మాత్రం కానరాని పరిస్థితి ఉంది. ఇప్పటికీ వాళ్లను ఏదో విధంగా మాటలతో మభ్యపెడుతుండడం గమనార్హం.



జిల్లాలోని 2.44 లక్షల మంది లబ్ధిదారుల్లో సుమారు 5 వేల మందికి ఇంటికి వెళ్లి అందజేయాల్సిన పరిస్థితి ఉంది. మిగతా వారికి ఖాతాల్లో నేరుగా రైతుబంధు మాదిరిగా పింఛను సొమ్ము జమచేసినా

నేరుగా డబ్బులు జమ చేస్తే..

ఇబ్బందులను అధిగమించవచ్చు. కానీ జగన్ ప్రభుత్వం స్వీయ లబ్ధి కోసం వలంటీరు వ్యవస్థను సృష్టించి ఇంటికి పింఛను పంపిణీ మాటున వైసీపీ పార్టీ ప్రచారం చేయించుకొంది. నెలకు కేవలం రూ.5 వేలు చేతిలో పెట్టి ఐదేళ్ల పాటు వారి జీవితాలతో ఆడుకొంది. తాము ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేసినా అధికార దండంతో నిరసన గళాన్ని నొక్కేసింది. గత ప్రభుత్వంలో ఎన్నికల ప్రక్రియ మొదలైన తర్వాత కూడా పింఛను పంపిణీ సాఫీగా సాగేది. ఎప్పటి మాదిరిగానే ఆయా వార్డులకు, గ్రామాలకు కేటాయించిన ఉద్యోగులు వెళ్లి పింఛను అందజేసేవారు. ఈ విధానానికి టీడీపీ ఎలాంటి స్వీయ లబ్ధిని ఆపాదించని కారణంగా ఇబ్బందులు ఉండేవికావు. గతంలో ఎన్నడూ ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత కూడా ఇప్పటి మాదిరిగా సమస్య ఉత్పన్నం కాలేదు. వైసీపీ ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం వలంటీరు పేరుతో యువతకు భద్రమైన ఉద్యోగం లేకుండా చేసింది. ప్రస్తుతం వారి విషయంలో జరుగుతున్న పరిణామాలు ఇదే విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి.

నేడు పింఛన్లు డౌటే

రాజమహేంద్రవరం,ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి) : పింఛన్‌దార్లతో వైసీపీ ప్రభుత్వం ఆడుకుంటోంది. వలంటీర్లను దూరం పెట్టడంవల్ల ఇబ్బంది కలిగిందని చెబుతున్న ప్రభుత్వం మంగళవారం కూడా జిల్లాలకు పింఛన్ల సొమ్ము పంపలేదు. బుధవారం జమయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఒకవేళ బుధవారం డబ్బు వచ్చినా బ్యాంక్‌లు 10 గంటలకు తెరచి లావాదేవీలు ఆరంభించేసరికి కనీసం 11 గంటలు అవుతుంది. వాటిని అన్ని సచివాలయాలకు చెందిన నిర్దేశిత ఉద్యోగులు వెళ్లి డ్రా చేసుకుని రావాలి. ప్రతి ఊరిలోనూ బ్యాంకులు ఉండవు. ఈ నేపథ్యంలో బ్యాంకుల్లో డబ్బు జమ అయినా, డ్రా చేయడానికి సమయం పడుతుంది. దీంతో బుధవారం కూడా పింఛన్లు పంపిణీ చేసే అవకాశాలు తక్కువ.

6వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ: కలెక్టర్

ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకూ పింఛన్లు పంపిణీ చేయనున్నట్టు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ డా.కె.మాధవీలత తెలిపారు. మంగళవారం జిల్లా డివిజన్ మండల స్థాయి అధికారులు, బ్యాంకర్లతో ఆమె తన చాంబర్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. మొదట 8వ తేదీ వరకూ పంపిణీ అని చెప్పారు. దీనిని 6వ తేదీకి కుదించారు. విభిన్న దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారు, మంచం పట్టిన వారు, వీల్ చైర్లకు పరిమితమైన వారు, యుద్ధవీరుల వృద్ధ వితంతువులకు బుధవారం ఉదయం 11 గంటల నుంచే ఇంటింటికీ పంపిణీ చేస్తామన్నారు. మిగిలిన వారికి గ్రామ, వార్డు సచివాలయాలలో పంపిణీ చేస్తారన్నారు. 6వ తేదీ వరకూ సచివాలయ ఉద్యోగులు ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకూ విధుల్లో ఉండాలన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని టెన్త్ విద్యార్థి దుర్మరణం



కరప, ఏప్రిల్ 2: కరప మండలం పెదకొత్తూరు ప్రధాన రహదారిపై మంగళవారం ఉదయం ఆర్టీసీ బస్సు ఢీకొని పదో తరగతి విద్యార్థి మృతి చెందాడు. కరప ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. రామచంద్రపురం మండలం ఓదూరు గ్రామానికి చెందిన బుంగా తనీష్ (15) కరప మండలం వేములవాడలో ఉంటున్న స్నేహితుడిని కలిసేందుకు మోటార్‌సైకిల్‌పై బయలుదేరాడు. పెదకొత్తూరు జానకీరామ రైస్‌మిల్లు వద్దకు వచ్చేసరికి కాకినాడ నుంచి రామచంద్రపురం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అతన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన తనీష్‌ను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. తనీష్ తండ్రి బుంగా రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

బుల్లెట్‌కు నిప్పుపెట్టిన దుండగులు



కరప, ఏప్రిల్ 2: మండల కేంద్రం కరపలో సోమవారం అర్ధరాత్రి ఇద్దరు దుండగులు బుల్లెట్‌కు నిప్పు పెట్టి పరారయ్యారు. కరప పోలీసులు, బాధితుడు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కరపకు చెందిన సానా వీరబాబు బిర్యానీ పాయింట్ పెట్టుకుని జీవనోపాధి పొందుతున్నాడు. సోమవారం రాత్రి వ్యాపారం ముగించుకుని హైస్కూల్ ఎదురుగా తాను ఉంటున్న ఇంటి సందులో బుల్లెట్ పెట్టి లోపలికి వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం లేచి చూసేసరికి బుల్లెట్ కాలిపోయిన స్థితిలో కనిపించింది. దీనిపై కరప పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. సమీపంలో ఉన్న సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించగా ఇద్దరు గుర్తుతెలియని దుండగులు పక్కనే ఉన్న పుల్లల దుకాణంలోకి వెళ్లి సందులో ఉన్న బండిని పెట్రోల్ పోసి అంటించినట్టు కనిపించింది. తనకు ముగ్గురు వ్యక్తులపై అనుమానం ఉందని, వారే కక్షపూరితంగా ఈ పని చేసి ఉండవచ్చని బాధితుడు పోలీసులకు తెలిపాడు. గత ఫిబ్రవరి 22వ తేదీ రాత్రి ఇంటి సందు బయట పెట్టిన బుల్లెట్ బండిని అపహరించుకుపోయారని, దీనిపై అప్పట్లోనే కరప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు బాధితుడు తెలిపాడు. రెండు వారాల క్రితం రూ.1.40 లక్షలతో మరో బుల్లెట్ బండిని కొనుగోలు చేయగా దుండగులు పెట్రోల్ పోసి తగలబెట్టారని బాధితుడు వీరబాబు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నాడు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు ఏఎస్ఐ సూరిబాబు తెలిపారు.

అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ అభ్యర్థులు వీరే..



మారోతి గణేశ్వరరావు (జగ్గంపేట)



ఎన్‌వీవీ సత్యనారాయణ (ప్రత్తిపాడు)

కాకినాడ పార్లమెంట్ పరిధిలో..

కాకినాడ సిటీ, ఏప్రిల్ 2 : రానున్న ఎన్నికలలో కాకినాడ జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల నుంచి పోటీ చేసే కాంగ్రెస్ అభ్యర్థులను కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ (సీఈసీ) ప్రకటించింది. తుని అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గేలం శ్రీనివాసరావు, ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా డీసీసీ ఉపాధ్యక్షుడు ఎన్‌వీవీ సత్యనారాయణ, పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా బ్లాక్-టు ప్రెసిడెంట్ మాదేపల్లి సత్యానందరావు, కాకినాడ రూరల్ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా పిల్లి సత్య లక్ష్మి, పెద్దాపురం నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా పీసీసీ మెంబర్ తుమ్మల దొరబాబు, కాకినాడ సిటీ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యరిగా జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు చెక్క నూకరాజు, జగ్గంపేట నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా పీసీసీ అధికార ప్రతినిధి మారోతి వీవీ గణేశ్వరరావును ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుకోటి పాండురంగారావు మాట్లాడుతూ ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి ప్రకటించిన అభ్యర్థుల జాబితాను స్వాగతిస్తున్నామన్నారు. కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి మల్లిపూడి మంగపతి పళ్లంరాజు సారథ్యంలో పార్టీ విజయానికి జిల్లాలో విస్తృత ప్రచారం నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు ఎవరని చూడకుండా పార్టీ గుర్తు హస్తాన్ని చూసి నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్ మేనిఫెస్టో పథకాలను వివరించాలన్నారు. జిల్లాలో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. వైసీపీ, టీడీపీ కూటమికి దీటుగా జిల్లాలో విస్తృత ప్రచారం చేపట్టాలని పాండురంగారావు పిలుపునిచ్చారు.

రాజమహేంద్రవరం పరిధిలో..



బోడా వెంకట్



బాలేపల్లి మురళీ

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 2: జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థుల పేర్లు ఖరారు చేశారు. ఈ మేరకు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ రాష్ట్ర వ్యాప్తంగా 114 మంది అభ్యర్థుల పేర్లు మంగళవారం ప్రకటించారు. తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం సిటీ నుంచి బోడా వెంకట్, రూరల్ నుంచి బాలేపల్లి మురళీధర్, అనపర్తి నుంచి డాక్టర్ యల్లా శ్రీనివాసరావు, రాజానగరం నుంచి ముండ్రు వెంకట శ్రీనివాస్, కొవ్వూరు నుంచి అరిగెల అరుణకుమారి, నిడదవోలు నుంచి పెద్దిరెడ్డి సుబ్బారావు పేర్లను ఏఐసీసీ ప్రకటించింది.

అమలాపురం పార్లమెంట్ పరిధిలో..



అయితాబత్తుల సుభాషిణి



సరెళ్ల ప్రసన్నకుమార్



కామన ప్రభాకరరావు

అమలాపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఆరు అసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల జాబితాను ఇడుపులపాయలో మంగళవారం పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విడుదల చేశారు. మండపేట అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిత్వం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ఉన్న కామన ప్రభాకరరావుకు దక్కింది. రామచంద్రపురం నుంచి కోట శ్రీనివాసరావు, ముమ్మిడివరం నుంచి పాలెపు ధర్మారావు, కొత్తపేట నుంచి రౌతు ఈశ్వరరావు, రాజోలు నుంచి సరెళ్ల ప్రసన్నకుమార్, అమలాపురం నియోజకవర్గం నుంచి అయితాబత్తుల సుభాషిణిలను ఖరారు చేశారు. అమలాపురం లోక్‌సభ, పి.గన్నవరం అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాలి..



పాలెపు ధర్మారావు



రౌతు ఈశ్వరరావు



కోట శ్రీనివాసరావు

ధ్వజస్తంభం నుంచి వెండి తొలగింపు పనులు ప్రారంభం



అధికారుల సమక్షంలో వెండిని తూకం వేస్తున్న దృశ్యం

అన్నవరం, ఏప్రిల్ 2: కోరిన కోర్కెలు తీర్చే కలియుగదైవం సత్యదేవుడి సన్నిధి స్వర్ణమయం కావడానికి అడుగులు వడివడిగా పడుతున్నాయి. ముందుగా స్వామివారి ధ్వజస్తంభానికి దాత సహాయంతో బంగారు తాపడం చేస్తున్న సంగతి విదితమే. దీనిలో భాగంగా శిథిలావస్థకు చేరిన వెండి ధ్వజ స్తంభం నుంచి వెండి ఒలిచే కార్యక్రమం మంగళవారం ఈవో రామచంద్రమోహన్, దేవదాయ శాఖ జ్యువెలరీ వెరిఫికేషన్ అధికారి భవాని పర్యవేక్షణలో కమిటీ సభ్యులు డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు, ఏఈవో ఎల్.శ్రీనివాస్, సూపరింటెండెంట్ అనకాపల్లి ప్రసాద్ చేపట్టారు. నెల్లూరుకు చెందిన దాత సుమారు రూ.4 కోట్ల వ్యయంతో 64 అడుగుల నార వేప కర్రపై రాగిరేకుపై బంగారు తాపడం చేయించనున్నారు. దీనికి సంబంధించి ఈనెల 18 నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి 22వ తేదీన బంగారు ధ్వజస్తంభం ప్రతిష్ఠించనున్నారు. అత్యంత వేడుకగా ఈ కార్యక్రమాలు జరపాలని ఈవో రామచంద్రమోహన్ నిర్ణయించారు. మంగళవారం రాత్రి పొద్దుపోయే వరకు వెండి ఒలిచే కార్యక్రమం కొనసాగించారు. దీనిని దేవదాయ కమిషనర్ అనుమతితో మింట్‌కు తరలించి వెండి కడ్డీలుగా మార్చాలని ఆలోచన చేస్తున్నారు. ఇప్పటికే దేవస్థానంలో సుమారు 1100 కేజీల వెండిని కడ్డీలుగా మార్చి భద్రపరిచారు. ఆలయ గోపురం స్వర్ణమయం చేసేందుకు అనుమతులు అతి త్వరలోనే రానున్నాయి. దీనికి సంబంధించి సోమవారం రత్నగిరికి విచ్చేసిన దేవదాయ కమిషనర్ సత్యనారాయణ సానుకూలత వ్యక్తం చేశారు. ఇప్పటికే దేవదాయ శాఖ స్థపతి ఆలయ గోపురాన్ని పరిశీలించి సుమారు 11.500 కేజీల బంగారం పడుతుందని ప్రాథమికంగా అంచనా వేయగా సుమారు రూ.7కోట్లు వ్యయం అవుతుందన్నారు. దేవదాయ కమిషనర్ అనుమతులు వచ్చిన వెంటనే దాతల సహకారంతో గోపురం స్వర్ణమయం పనులు ప్రారంభించనున్నారు.

కలెక్టర్‌ను కలిసిన అన్నవరం ఈవో



కలెక్టర్ నివాస్‌కు ప్రసాదం అందిస్తున్న ఈవో

కాకినాడ కలెక్టరేట్/ అన్నవరం, ఏప్రిల్ 2: కాకినాడ జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన నివాస్‌ను అన్నవరం దేవస్థానం ఈవో కె.రామచంద్రమోహన్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ఈనెల 22న జరిగే బంగారు ధ్వజస్థంభం ప్రతిష్ఠాపనకు ఆయనను ఆహ్వానించారు. వచ్చే నెల 18 నుంచి 24 వరకు సత్యదేవుడి వార్షిక కల్యాణోత్సవాలు, 19న స్వామివారి దివ్య కల్యాణం జరగనుందని వివరించారు. ఈ సందర్భంగా అలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులను కలెక్టర్‌కు వివరించారు. అనంతరం దేవస్థానం వేదపండితులు ఆయనకు వేదాశీర్వచనం అందజేశారు. పీఆర్వో కృష్ణారావు, డిప్యూటీ ఇంజనీర్ రాంబాబు, బీఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

అవయవదానం



రాజు

మండపేట, ఏప్రిల్ 2: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం మారేడుబాక గ్రామానికి చెందిన కౌలు రైతు కాదా రాజు(38) మృతిచెందడంతో ఆయన కుటుంబ సభ్యులు అవయవదానం చేసి స్ఫూర్తిగా నిలిచారు. రాజు మార్చి 28న సైకిల్‌పై నుంచి పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతో స్థానిక ఆసుపత్రికి తరలించారు. స్థానిక వైద్యుల సూచనతో రాజమహేంద్రవరం అక్కడ నుంచి విశాఖపట్నంలో ఉన్న కిమ్స్ ఆసుపత్రికి రాజును తరలించారు. అక్కడ పరీక్షలు చేసిన వైద్యులు రాజుకు తలకు తగిలిన బలమైన గాయం వల్ల బ్రెయిన్ డెడ్ అయిందని ధ్రువీకరించారు. అతను బతకడం కష్టమని వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో రాజు శరీరంలో అవయవాలను కుటుంబసభ్యులు ఆస్పత్రిలో ఉన్న అవయవదాన్ ట్రస్టుకు మంగళవారం దానం చేశారు. రాజుకు భార్య మణి, కుమార్తె భార్గవ్ ప్రవీణ, కుమారుడు అవినాష్ ఉన్నారు. మరణానంతరం రాజు పది మందికి తన అవయవాలను దానం చేసి జీవితాన్ని సార్థకం చేసుకున్నాడు. రాజు మృతదేహాన్ని స్వగ్రామం మారేడుబాకకు తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

11న లోక్ అదాలత్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రాపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల కోర్టుల్లో ఈ నెల 11న లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత మంగళవారం తెలిపారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. ఆయా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, యాక్సిడెంట్ కేసులు, బ్యాంకు కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, ప్రీ-లిటిగేషన్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించనున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం అందిస్తున్న దాతలు

అన్నవరం, ఏప్రిల్ 2: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి మంగళవారం ఒకదాత రూ 1,01,116 విరాళంగా సమర్పించారు. విశాఖపట్నానికి చెందిన వై.సాయి జగన్నాథ్ ఈ మొత్తాన్ని ఆలయ పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



తుని రూరల్, ఏప్రిల్2: తుని రైల్వేస్టేషన్‌లో 1వ నెంబరు ప్లాట్‌ఫాం మొదలు కొండవారిపేట తూము దగ్గరలో పట్టాలు దాటే క్రమంలో అన్నవరం వైపు వెళ్లే గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో 30 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. శరీరంపై టీ షర్ట్, మిలట్రీ గ్రీన్ జీన్ ఫ్యాంట్ ఉంది. చేతిపై ఓం అనే పచ్చబొట్టు ఉంది. బంధువులు గుర్తిస్తే తుని రైల్వే పోలీసులను సంప్రదించాలని రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారుఫ్ తెలిపారు.

యాజమాన్యం నిర్లక్ష్యం

ప్రాణాపాయ స్థితిలో గురుకుల పాఠశాల విద్యార్థి

కరప, ఏప్రిల్ 2: గురుకుల పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా ఒక విద్యార్థి ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రం కరపలో మహాత్మాజ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల లో యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ గ్రామానికి చెందిన పెర్ల జాన్‌బాబు 9వ తరగతి చదువుతున్నాడు. గత మార్చి 30వ తేదీన పాఠశాల ప్రాంగణంలో ఆడుకుంటూ ఉండగా అనుకోకుండా రెండు అంగుళాల ఇనుప ముక్కను మింగేశాడు. జాన్‌బాబు కడుపులోకి వెళ్లిన ఆ ఇనుప ముక్క క్రమేపి పెద్దపేగులోకి వెళ్లి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఇంత జరిగినా పాఠశాల ప్రిన్సిపాల్ గోప్యత పాటించి సదరు విద్యార్థిని ఆసుపత్రిలో చేర్పి మంగళవారం ఆపరేషన్ చేయించారు. ప్రస్తుతం ఆ విద్యార్థి కోలుకుంటు న్నట్లుగా తెలిసింది. అయితే జరిగిన ఘటనపై విద్యార్థి తల్లిదండ్రులు పెర్ల తాతారావు, సత్యవేణిలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఘటన జరిగిన నాలుగు రోజులైనా ప్రిన్సిపాల్ తమకు తెలపకుండా గోప్యత పాటించడంపై వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై తక్షణం విచారణ జరిపి సదరు ప్రిన్సిపాల్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని బాధిత తల్లిదండ్రులు కోరుతున్నారు.

బెల్టు షాపులపై దాడి

ఒకరిపై కేసు నమోదు

వై.రామవరం,ఏప్రిల్ 2: అల్లూరి జిల్లా వై.రామవరం మండలంలో మద్యం బెల్టు షాపులపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) కొరడా ఝులిపించింది. ఈ నెల 1న ఆంధ్రజ్యోతిలో బెల్టుపై బేఖాతర్ శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు చవిటిదిబ్బలు ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి తరలిస్తున్న అక్రమ మద్యం సీసాలపై నిఘా పెట్టారు. పలు బెల్టుషాపులపై దాడులు జరిపి మంగళవారం ఒకరిపై కేసు నమోదు చేశారు. రంపచోడవరం ఎస్ఈబీ సీఐ ఎన్.ఇంద్రజిత్ తెలిపిన వివరాల ప్రకారం ఎస్ఈబీ జిల్లా సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు(పాడేరు) ఆదేశాలతో అసిస్టెంట్ సూపరింటెండెంట్ పి.నాగరాహుల్ ఆధ్వర్యంలో ఎస్ఐ అబ్దుల్ ఆలీతో కలిసి దాడులు జరిపామన్నారు. మద్యం సీసాలు అక్రమంగా తరలిస్తున్న ఒకరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు.

కాకినాడ

5న అధికారికంగా జగ్జీవన్‌రామ్ జయంతి

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 2: ఈనెల 5వ తేదీన డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని జిల్లా కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరోజు ఉదయం 9.30 గంటలకు కాకినాడ లయన్స్ లేడీస్ రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంద్రపాలెంవద్ద ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పిస్తారన్నారు. కార్యక్రమంలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.


పెద్దాపురంలో మిక్చర్ బళ్ల వర్తకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప


గండేపల్లిలో ప్రచారం చేస్తున్న ఉమ్మడి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ


రౌతులపూడి: ఎస్.పైడిపాలలో ప్రచారం నిర్వహిస్తున్న సత్యప్రభ


కరప: సిరిపురంలో ప్రచారం చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

చిరు వ్యాపారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తాం

● ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

పెద్దాపురం, ఏప్రిల్ 2: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికా రంలోకి వచ్చిన తరువాత చిరువ్యాపారులను అన్నివిధాలుగా ప్రోత్సహిస్తామని ఎమెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక దర్గా సెంటర్‌లో ఉన్న టీడీపీ నేత రాజాసూరిబాబురాజు స్వగృహం వద్ద మిక్చర్‌బళ్ల వర్తకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మంగళవారం మాట్లాడారు. చిరువ్యాపారులకు టీడీపీ ప్రభుత్వ హయాంలో వారి అభివృద్ధికి ఎంతో కృషి చేసినట్లు గుర్తుచేశారు. అనంతరం సుమారు 50మంది మిక్చ ర్ బళ్ల వ్యాపారులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ రాజప్ప పార్టీ కండువా ను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో తూతిక రాజు, కొరిపూరి రాజు, అనివిళ్ల శాస్త్రీ పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే కుట్ర రాజకీయాలు

గండేపల్లి: ఓటమి భయంతోనే వైసీపీ ప్రభుత్వం సీఎం జగన్ కుట్ర రాజకీయాలు చేస్తున్నాడని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని గండేపల్లిలో మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుపై ఓటేసి కూటమిని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి కోర్పు లచ్చయ్య దొర, మండల పార్టీ అధ్యక్షుడు పోతుల మోహనరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కోర్పు సాయితేజ్, కుంచే రాజా, యువ నాయకులు జాస్తి వసంత్, కందుల చిట్టిబాబు, పరిమిబాబు, దాపర్తి సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

రజకులను ఆదుకునేది టీడీపీయే : జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట: ఇర్రిపాకలో జ్యోతుల నెహ్రూ స్వగృహం వద్ద రజక చైతన్య సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాతా సీతారాముడు ఆధ్వర్యంలో జగ్గంపేట టీడీపీ అభ్యర్థి జ్యోతుల నెహ్రూను ఘనంగా సత్కరించి రేపు రాబోయే ఎన్నికల్లో రజకులందరూ మద్దతుగా ఉంటామని హామీఇచ్చారు. సీతారాముడు మాట్లాడుతూ బీసీలను ఆదుకున్నది టీడీపీ అని ముఖ్యంగా రజక కులానికి కులవృత్తులను ప్రోత్సహించడంలో భాగంగా ఆదరణ పథకం ద్వారా వాషింగ్ మిష న్లు, ఇస్త్రీ పెట్టెలు, ఇలా వారి కులవృత్తులకు కావాల్సిన పనిముట్లు అందజేసి వారిని ఆదుకోవడమే కాకుండా రజక విద్యార్థులకు ఉన్నత విద్య అభ్యసించేందుకు టీడీపీ అనేక పథకాలు తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ కార్యదర్శి ఎం.పవన్‌కుమార్ పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలోనే అన్ని వర్గాలకు మేలు

రౌతులపూడి: చంద్రబాబు ప్రభుత్వంలోనే అన్ని వర్గాలకు మేలు జరిగిందని, జగన్ ప్రభుత్వంలో అన్యాయం జరిగిందని ఎన్డీఏ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సత్యప్రభ అన్నారు. ఎస్.పైడిపాలలో టీడీపీ నేతలు, మాజీ సర్పంచ్‌లు గొల్లు పెద్దదివాణం, సత్తిబాబు ఆధ్వర్యంలో మీ ఇంటికి మీ సత్యప్రభ, సూపర్ సిక్స్ పథకాలపై కార్యక్ర మం నిర్వహించారు. ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు బీజేపీనేత ఉమ్మడి వెంకట్రావు, జనసేన నేతలు పాల్గొన్నారు.

సైకో పోవాలి..ప్రజలు గెలవాలి : టీడీపీ కో-ఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు

సిరిపురం(కరప): రాష్ట్రంలో సాగుతున్న సైకో పాలన పోవాలని, ప్రజలు గెలవాలని టీడీపీ కాకినాడరూరల్ కో-ఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మిలు ఆకాంక్షించారు. కరప మండలం సిరిపురం గ్రామంలో మంగళవారం ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీని గెలిపించాలంటూ చేసిన ఎన్నికల ప్రచారంలో వారు మాట్లాడారు. అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, దీనికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని విజ్ఞప్తిచేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కాకినాడరూరల్ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి నానాజీ, ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయశ్రీనివాస్‌లను గాజు గ్లాసు గుర్తుపై వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కో-కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు, టీడీపీ మండలాధ్యక్షుడు దేవు వెంకటేశ్వరరావు(వెంకన్న), ఆయా పార్టీల నాయకులు చిక్కాల దొరబాబు, పంతం సందీప్, బందారు మురళి, బోగిరెడ్డి కొండలరావు, బోగిరెడ్డి గంగాధర్, మద్దూరి స్వామి, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ ప్రభుత్వాన్ని సాగనంపండి

కిర్లంపూడి: వైసీపీ దోపిడీ ప్రభుత్వాన్ని సాగనంపాలని టీడీపీ కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కుమార్తె తోట సునీత అన్నారు. కిర్లంపూడిలో ఎస్సీపేటలో ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుపై ఓటేసి నెహ్రూను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తోట సర్వారాయుడు, చదరం చంటిబాబు, తూము కుమార్, కుర్ల చినబాబు, గుడాల రాంబాబు, ఆళ్ల నానాజీ పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని గెద్దనాపల్లి, భూపాలపట్నం, తిమ్మాపురం, శృంగరాయునిపాలెం గ్రామాల్లో టీడీపీ దళితగళం నాయకులు ప్రచారం నిర్వహించారు.

విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషిచేస్తా

● కలెక్టర్ జె.నివాస్


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న వీసీ ప్రసాదరాజు

జేఎన్టీయూకే, ఏప్రిల్ 2: కాకినాడ జేఎన్టీయూకే విశ్వవిద్యాలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కాకినాడ జిల్లా నూతన కలెక్టర్ జె.నివాస్ అన్నారు. వర్శిటీ ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు మంగళవారం నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన జె.నివాస్‌ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా వర్శిటీలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. అనంతరం వీసీ మాట్లాడుతూ సాంకేతిక రంగంలో విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు కృషిచేస్తున్నామన్నారు. వీసీ వెంట ఇంక్యుబేషన్ సెంటర్ అకడమిక్ సలహాదారుడు జేవీఆర్ మూర్తి ఉన్నారు.

శ్రీలలితా స్టోన్ క్రషర్‌కు షోకాజ్ నోటీసు

ఏలేశ్వరం, ఏప్రిల్ 2: ఏలేశ్వంలో శ్రీలలితా స్టోన్ క్రషర్‌కు షోకాజ్ నోటీసు అందించారు. మంగళవారం పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు నుంచి ప్రజారోగ్యం, పర్యావరణ ప్రయోజనాలు దృష్ట్యా స్టోన్ క్రషర్‌లలో పరిసరాలు దుమ్ము నియంత్రణ, వైబ్రేషన్, చెట్లు పెంచడం, వాటరింగు వాయు కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకోవాలన్నారు. చర్యలు పాటించడంలో విఫలమైతే బోర్డు ప్రారంభించి, గాలి, నీటి చట్టాల ప్రకారం స్టోన్ క్రషర్‌పై చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నారు.

గోవులను తరలిస్తున్న వాహనం సీజ్

జగ్గంపేట, ఏప్రిల్ 2: గోవులను అక్రమంగా తరలిస్తున్న బొలెరో గూడ్స్ వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. రామవరం గ్రామానికి చెందిన వెంకటరమణ అనే వ్యక్తి జాతీయ రహదారిపై వాహనంలో 13 గోవులను తరలిస్తుండగా అడ్డుకున్నాడు. వ్యాన్‌లో చూడగా 13 గోవులు ఉన్నాయి. దీనిపై వెంకట రమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూగజీవాలను అక్రమంగా రవాణా చేస్తున్న వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆటిజం దినోత్సవం

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 2: వాకలపూడి ఉమా మనో వికాస కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పీ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సర్పవరం జంక్షన్‌లో ఎస్ఆర్ఎంటీ ఫంక్షన్ హాల్లో ఘనంగా ప్రపంచ ఆటిజం (అంతుర్మఖి) దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వివిధ ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్, వృద్ధుల సంక్షేమశాఖ ఏడీ పి.నారాయణమూర్తి మాట్లాడుతూ ఆటిజం అనేది తల్లి గర్భంలో బేబీ ఉన్నప్పుడు మొదటి మూడునెలలు కీలకమని, జన్యుపరంగా, సీజర్స్, మెనిన్ జైటిస్ వంటి వాటితో ఆటిజం వస్తోందన్నారు. విస్తతస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించడంతో ఆటిజం నుంచి ఆరోగ్యవంతమైన సమాజంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా చక్కటి నాటిక రూపంలో ఆటిజంపై విద్యార్థులు ప్రదర్శించిన నాటిక ఆకట్టుకుంది. కార్యక్రమంలో సంస్థ పీడీ కె.నారాయణరెడ్డి, ఎస్.ఉమారెడ్డి, ఎస్‌ఏ నాయుడు, రాంజీ అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాలతో దివ్యాంగులకు మంచి భవిష్యత్

కోటనందూరు : ఆటిజంతో బాధపడుతున్న చిన్నారులకు భవితకేంద్రాల ద్వారా అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ అన్నారు. మంగళవారం పాఠశాలల్లో ప్రపంచ అటిజం దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌పీలు నాగ గోవింద్ నారాయణరావు పాల్గొన్నారు.

పిల్లల ప్రవర్తన గుర్తించాలి

ఏలేశ్వరం: ప్రపంచ ఆటిజం డే సందర్భంగా తల్లిదండులకు అవగాహన కల్పించారు. మంగళవారం స్థానిక భవిత కేంద్రంలో ఆటిజండే పురస్కరించుకొని భవిత కేంద్రం ఉపాధ్యాయులు వాణిపద్మజ, బుజ్జి తల్లిదండులకు పిల్లల ప్రవర్తన, వారి విధివిధానాలు తల్లిదండులు గమనించాలన్నారు.

నవోదయా పరీక్షా ఫలితాలు విడుదల

పెద్దపురం, ఏప్రిల్ 2: జవహర్ నవోదయా విద్యాలయంలో 2024-25కి సంబంధించి ఆరవ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షల ఫలితాలు ఈనెల 2వ తేదీన విడుదలైనట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ ఆర్.కమలం తెలిపారు. 8506 మంది విద్యార్థులు పరీక్షల కు హాజరుకాగా వారిలో 80 మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు విద్యాలయానికి వచ్చి అడ్మిషన్‌కు సంబంధించిన పత్రాలను తీసుకోవాలని ఆమె కోరారు.


తునిలో టీడీపీలో చేరినవారితో యనమల రామకృష్ణుడు


కాకినాడలో టీడీపీలో చేరినవారితో కొండబాబు


టీడీపీలో చేరిన వైసీపీ నాయకుడు సూర్యప్రకాష్‌కు కండువావేసి ఆహ్వానిస్తున్న సత్యప్రభ

సమన్వయంతో పని చేస్తే విజయం మనదే

● రాష్ట్ర ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు

తునిరూరల్, ఏప్రిల్ 2: సమన్వయంతో పనిచేస్తే పార్టీ ఘనవిజయం తథ్యమని రాష్ట్ర శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. పేదల అభ్యున్నతి లక్ష్యంగా కూటమి పార్టీలు రూపొందించిన సూపర్‌సిక్స్ పథకాలు అన్నివర్గాల్లో వెలుగులు నింపుతాయన్నారు. తుని పట్నం వైసీపీ నుంచి టీడీపీలోకి పెద్దఎత్తున చేరిన కార్యకర్తలకు ఆయన పార్టీకండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో తుని పట్టణ టీడీపీ అధ్యక్షుడు యినిగంటి సత్యనారాయణ, కుసుమంచి సత్యనారాయణ, కుక్కడుపు బాలాజీ, దంతులూరి శ్రీనివాసరాజు, వెంకటేష్ ఉన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ చేరికలు

కాకినాడ సిటీ : గత ఐదేళ్ల కాలంగా కాకినాడ నగరంలో కొనసాగుతున్న అవినీతి, దోపిడీ, భూకబ్జా, గూండాల పాలనతో విసిగి చెందిన నగర ప్రజలతోపాటు వైసీపీకి చెందిన అనేక మంది టీడీపీలో చేరుతున్నారని కాకినాడ సిటీ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వనమాడి కొండబాబు పేర్కొన్నారు. స్థానిక జగన్నాధపురంలోని కొండబాబు నివాసంవద్ద ఏర్పాటు చేసిన కార్యక మంలో వైసీపీకి చెందిన బొడ్డిపల్లి నాని, బొందాడ లక్ష్మి, పెమ్మాడి నాగూర్, నీలాపు శశిభూషణ్ రెడ్డి పెద్ద సంఖ్యలో వారి అనుచరులతో టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలువేసి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో గల కాకినాడ నగరం పేరును వైసీపీ పాలకులు చెడదీసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ సోషల్ మీడియా కో కన్వీనర్


ప్రత్తిపాడు: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఏలేశ్వరం మండలం వైసీసీ సోషల్ మీడియా కో కన్వీనర్ సుందరవేణి సూర్యప్రకాష్ సోషల్ మీడియా పదవికి రాజీనామా చేశారు. వలంటరీ ఉద్యోగానికి కూడా రాజీనామా చేసి మంగళవారం ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జ్ వరుపుల సత్యప్రభ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా సత్యప్రభ మాట్లాడుతూ వైసీపీ సోషల్ మీడియాలో పనిచేసిన సూర్యప్రకాష్ టీడీపీలో జాయిన్ కావడంతో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం మండల మాజీ జడ్పీటీసీ జ్యోతుల పెదబాబు తదితరులు ఉన్నారు. చింతలూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు జింకల ఫకీర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ప్రత్తిపాడు విచ్చేసి సత్యప్రభ రాజాకు మద్దతు తెలిపారు.

50 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరిక

శంఖవరం: శంఖవరం గ్రామంలో వైసీపీకి చెందిన 50 కుటుంబాలు టీడీపీ పార్టీలో చేరారు. టీడీపీ సినీయర్ నేత పర్వత సురేష్ ఆధ్వర్యంలో వార్డుమెంబర్ తంగేళ్ల సోమరాజు, కటారి రాముడు, బద్దేటి రాజులుతో సహా 50 కుటుంబాలు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సత్యప్రభ సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షు డు బద్దిరామారావు, టీఎన్‌యుసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెన్నాశివ, తెలుగు యువత అధ్యక్షుడు కీర్తి సుభాష్, బుర్రా ప్రసాద్, టీడీపీ, బీజేపీ, జనసేన నాయుకులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు ప్రతీ విద్యార్థి కృషి చేయాలి

● ట్రైనీ డీఎస్పీ యశ్వంత్


ప్రసంగిస్తున్న ట్రైనీ డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్

సామర్లకోట, ఏప్రిల్ 2: ప్రాథమిక విద్యాభ్యాసం నుంచీ ప్రతీ విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ లక్ష్యాలను సాధించాలని పెద్దాపురం ట్రైనీ డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ పేర్కొన్నారు. సామర్లకోట వివేకానంద విద్యాసంస్థల వార్షికోత్సవ వేడుకలు మంగళవారంరాత్రి నిర్వహించారు. కరస్పాండెంట్ బీఏఎస్. సరోజిని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ట్రైనీ డీఎస్పీ యశ్వంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి నడవడిక, క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులను ముఖ్యఅతిథులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు వై. శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, సీహెచ్. వెంకటేశ్వరరావు, సీహెచ్ శైలూష, సీహెచ్. వికాష తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ పర్యటన విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 2: కాకినాడరూరల్ ఇంద్రపాలెంలో ఈనెల 8వ తేదీన పవన్ కల్యాణ్ నిర్వహించే బహిరంగ సభ విజయవంతానికి కృషి చేయాలని జనసేన రూరల్ అభ్యర్థి పంతం నానాజీ, టీడీపీ రూరల్ నియోజకవర్గం కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తిలు కోరారు. మంగళవారం వలసపాకల గంగరాజునగర్‌లో జనసేన పార్టీ కార్యాలయంలో ఉమ్మడి పార్టీ నాయకులతో నిర్వహించిన బహిరంగ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవన్ పర్యటన ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ముందస్తుగా బహిరంగ సభకు అవసరమైన అన్ని అనుమతులు తీసుకుంటామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పూర్తి సమన్వయంతో సమిష్టిగా సభ విజయవంతానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో కో కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ), టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు, మాజీ జడ్పీటీసీ నులు కుర్తి వెంకటేశ్వరరావు, కరెడ్ల గోవిందు, దేవు వెంకటేశ్వరరావు, శిరంగు శ్రీనివాసరావు, వీరబాబు పాల్గొన్నారు.


తాళ్లరేవు ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నేతలు


పెద్దాపురం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అంద చేస్తున్న టీడీపీ నేతలు


ఏలేశ్వరంలో ఎంపీడీవోకు వినతిప్రతం అందజేస్తున్న ఎంపీపీ తదితరులు


సామర్లకోట ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న రూరల్ కూటమి పార్టీల నాయకులు

పెన్షన్లు ఇంటింటా పంపిణీ చేయాలి

● టీడీపీ, జనసేన నాయకుల నిరసన

● టీడీపీ నేతల ఎంపీడీవోలకు వినతి

పెద్దాపురం, ఏప్రిల్ 2: వృద్ధులు, దివ్యాంగుల, వితంతంతు తదితర సామాజిక భద్రతా పెన్షన్లు నేరుగా లబ్ధిదారుల ఇళ్లవద్దకే వెళ్లి అందించేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, ఎంపీడీవో ఎం.ఉషారాణిలకు వినతి పత్రాలను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రంది సత్యనారాయణ, కొత్తెం వెంకట శ్రీనివాసరావు (కోటి), తూతిక రాజు, బొడ్డు ఉదయశంకర్, బేదంపూడి సత్తిబాబు, తుమ్మల నాని, పాల్గొన్నారు.

తాళ్లరేవు: ప్రభుత్వం పేదలకు అందించే పింఛన్లు సచివాలయ సిబ్బందితో ఇంటింటికీ తిరిగి ఇప్పించాలని రాష్ట్రపార్టీ పిలుపు మేరకు టీడీపీ మండలస్థాయి నేతలు ఎంపీడీవో ప్రభాకరావుకు మంగళవారం వినతిపత్రం అందించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంవద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేత లు మందాల గంగసూర్యనారాయణ, ధూళిపూడి వెంకటరమణ, మం దాల గంగసూర్య నారాయణ, పొన్నమండ రామలక్ష్మి, జవ్వాది తాతాజీ పాల్గొన్నారు.

ఏలేశ్వరం: పెన్షన్లు సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయాలని పట్టణ టీడీపీ శ్రేణులు కమిషన ర్ శివప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా టీడీపీ కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, అలమండ చలమయ్య మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం వలంటీర్లకు ప్రభుత్వం అందించిన సెల్‌ఫోన్, సిమ్‌కార్డు తక్షణమే స్వాధీనం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎండగుండి నాగబాబు, కోనాల వెంకటరమణ, టీడీపీ నాయకులు చల్లా గణేష్, బూర్లు సత్తిబాబు, కోరాడ కృష్ణమోహన్, భజంతుల మణి, బుగతా శ్రీను,కిలారి రామచంద్రరావు, సామంతుల గోపి, బాబ్జి, పాల్గొన్నారు.

జగ్గంపేట: పింఛన్ల సొమ్ముతోపాటు ప్రభుత్వ నిధులు రూ.13వేల కోట్లు సొంత కాంట్రాక్టర్లకు దోచిపెట్టి, ఖజానా ఖాళీ కావడంతో జగన్ ప్రభుత్వం మరో కొత్త డ్రామాకి తెరలేపారని జగ్గంపేట మండల టీడీపీ అధ్యక్షుడు మారిశెట్టి భద్రం మండిపడ్డారు. జగ్గంపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జగ్గంపేట ఎంపీడీ వోకు పింఛన్లు ఇంటింటికి పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జగ్గంపేట టౌన్ టీడీపీ అధ్యక్షులు పాండ్రంగి రాంబాబు, జగ్గంపేట టౌన్ తెలుగు యువత అధ్యక్షులు కొండ్రోతు శ్రీను, వెంకటేశ్వరరావు, దార్ల నానాజీ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పడాల ఈశ్వర రావు, పడాల రాంబాబు, పడాల దుర్గాప్రసాద్ పడాల బాలాజీ, కూసిమించి బాల రాజు, పడాల విష్ణుమూర్తి, పాలిశెట్టి సతీష్, మానెల్లీ దుర్గప్రసాద్, కురందాస్ వెంకన్న, యర్రంశెట్టి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కరప: లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లను పంపిణీ చేయాలని టీడీపీ కాకినాడరూరల్ కో-కోఆర్డినేటర్ కటకంశెట్టి వెంకటప్రభాకర్(బాబి) అధికారులకు విజ్ఞప్తిచేశారు. కరపలో మంగళవారం ఆయన పార్టీ నాయకులతో ఎంపీడీవో కొంకి అప్పారావును కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. టీడీపీ కో-ఆర్డినేటర్ పిల్లి సత్తిబాబుతో కలిసి కాకినాడరూరల్ ఎంపీడీవోకు కూడా వినతిపత్రం సమర్పించినట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. టీడీపీ మండలాధ్యక్షుడు దేవు వెంకటేశ్వరరావు(వెంకన్న), నాయకులు కౌజు నెహ్రూ, కర్రి శ్రీను, ఎజ్జల బాబీ, పాట్నీడి రాంబాబు, కోన వెంకటలక్ష్మి, గీసాల వెంకటేశ్వరరావు, కంచుమర్తి లావణ్య, ఉమామహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: పింఛన్లను సచివాలయ సిబ్బందితో ఇంటింటికీ పంపిణీ చేయాలని టీడీపీ, జనసేన నాయకులు మండలంలోని శృంగరాయునిపాలెం పంచాయతీవద్ద మంగళవారం ఆందో ళన నిర్వహించారు. సర్పంచ్ పట్టు చంటిబాబు, ఎంపీటీసీ గరగా గోవిందు, ఉపసర్పంచ్ బొజ్జపు శ్రీను, గొడే బాల, అల్లుమల్ల బాబీ, జనసేన అరిణే రాజేష్ ఆధ్వర్యంలో పింఛన్‌దారులకు మద్దతుగా నిరసన తెలిపారు. ఎంపీపీ తోట రవి, సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు, భూపాలపట్నం ప్రసాద్ వీరికి మద్దతుగా నిలిచారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. అదేవిధంగా కిర్లంపూడిలో టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు ఆధ్వర్యంలో డిమాండ్లతో కూడిన పత్రాన్ని ఈవోపీఆర్డీకి అందించారు. కుర్ల చినబాబు, తూము కుమార్, గుడాల రాంబాబు, ఆళ్ల బాబులు, ఆళ్ల నానాజీ, కాళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సామర్లకోట: పింఛన్ల లబ్ధిదారులకు ఇళ్ల వద్దకే పింఛన్ల సొమ్ము పంపిణీ చేయాలని, అందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతూ సామర్లకోట మండల, పట్టణ టీడీపీ కమిటీ నాయకుల ఆధ్వర్యంలో ఎంపీడీవో శ్యామ్‌సుందర్‌కు, మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావులకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వలంటీర్లకు బదులుగా ప్రభుత్వ సిబ్బందిని నియమించి పింఛన్లను యథావిధిగా పంపిణీ చేయాలన్నారు. ఈ సందర్భంగా పట్టణ, మండల టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలి

సర్పవరం జంక్షన్: వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఇంటి వద్దే సామాజిక పింఛన్లు పంపిణీ చేసేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని టీడీపీ కాకినాడ రూరల్ కో కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ) డిమాండ్ చేశారు.ఈ మేరకు మంగళవారం రమణయ్యపేట ఎంపీడీవో రమేష్‌నాయుడుకు వినతి పత్రం అందించారు.

బీఎస్ఎన్ఎల్ కార్యాలయ ఆవరణలో అగ్నిప్రమాదం

గొల్లప్రోలు, ఏప్రిల్ 2: గొల్లప్రోలు పట్టణంలోని రాయవరం రోడ్డులో గల బీఎస్ఎన్ఎల్ కార్యాలయ ఆవరణలో మంగళవారం అగ్నిప్రమాదం జరిగింది. కార్యాలయ ఆవరణలో ఉన్న కేబుల్స్, వైర్లు దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. అక్కడకి సమీపంలో టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, సెల్ టవర్ సామాగ్రి ఉన్నాయి. ఇవి అంటుకుంటే భారీ నష్టం జరిగేదని చెబుతున్నారు.

ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ పని చేస్తుంది

● కాకినాడ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పళ్లంరాజు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 2 :ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస పార్టీ పనిచేస్తుందని కాకినాడ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, కేంద్ర మాజీ మంత్రి మల్లిపూడి మంగపతి పళ్లంరాజు పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడంతో మంగళవారం కాకినాడలోని పళ్లంరాజు ఇంటివద్ద సందడి వాతావరణం నెలకొంది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుకోటి పాండురంగారావు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మట్టా శివప్రసాద్, నాయకులు మల్లిపూడి రాంబాబు, చెక్క నూకరాజు, రాజా రపు మహేష్, కుక్కల పోతురాజు, పెద్దాడ సుబ్బారాయుడు, బాజిబోయిన వెంకటేష్‌నాయడు తదితరులు పళ్లంరాజును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు పాండురంగారావు మాట్లాడుతూ పార్టీ అధిష్టానం ప్రకటించిన అభ్యర్థుల విజయానికి నాయకులు సమాయత్తం కావాలన్నారు.

పారిశ్రామికవేత్త సుబ్బారావు భార్య రాజవేణి మృతి

జగ్గంపేట, ఏప్రిల్ 2: జగ్గంపేట గ్రామానికి చెందిన ప్రముఖపారిశ్రామిక వేత్త దివంగత తులా సుబ్బారావు భార్య తులా రాజవేణి(86) మంగళవారం సాయంత్రం మృతి చెందారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

ఇఫ్తార్ విందులో వనమాడి ప్రార్థనలు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 2 : స్థానిక జగన్నాధపురం జె.రామారావుపేట మక్కా మసీదు కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఎంఎం ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పాల్గొని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మక్కా మసీదు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కాజా మొహిద్దీన్, ఎస్‌కే ఆజా మొహిద్దీన్‌లు కొండబాబును శాలువాతో సత్కరించారు.మైనారిటీ నాయకులు ఎండీ ఖాన్, సయ్యద్ ఆలీ, అన్వర్, ఇమం సాహెబ్, వల్లి, మొయిన్, తాజుద్దీన్, అన్సర్ పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి జాతర

జగ్గంపేట, ఏప్రిల్2: జగ్గంపేట సత్యవేణి పేటలో ఉన్న సత్తెమ్మతల్లి వార్షిక జాతర వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఆలయంలో అమ్మవారికి పూజాధికార్యక్రమాలు నిర్వహించి పెద్ద ఎత్తున మహిళలు, యువతులు బోనాలు నెత్తిన ఎత్తుకుని గ్రామ ంలో నూకాలమ్మ తల్లి ఆలయంవరకు భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఊరేగింపు సాగించారు. ఈ కార్యక్రమానికి సరస్వతీ పుత్రులు ఒమ్మి రఘురాం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు మొరుకుర్తి రాజు, కురుమళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో జాతర నిర్వహిస్తామని, జాతర ముగింపు

నూకాలమ్మ జాతర ఏర్పాట్లపై సమీక్ష

పెద్దాపురం, ఏప్రిల్ 2: మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ జాతర మహోత్సవాలు ఈనెల 7నుంచి వచ్చేనెల 21వ తేదీ వరకూ జరగనున్న నేపథ్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. దేవస్థానం ఈవో టీవీ సూర్యనారాయణ ఆధ్వ ర్యంలో జరిగిన సమావేశంలో ఆర్డీవో కార్యాలయ ఏవో సుబ్రహ్మణ్యం పాల్గొని మాట్లాడారు. ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, ఫైర్, హెల్త్, పంచాయతీ తదితర శాఖలకు చెందిన అధికారులతో సమా వేశం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఛైర్మన్ గవరసాన వీరాస్వామి ఆయా శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

సెర్ప్ ఏపీఎంను నిలదీసిన టీడీపీ నేతలు

తాళ్లరేవు, ఏప్రిల్ 2: ఎన్నికలకోడ్ అమలులో ఉన్నా తాళ్లరేవు మండల మహిళా సమాఖ్యకార్యాలయంలో వీఓఏలతో సమావేశం నిర్వహించిన సెర్ప్ ఏపీఎం సన్యాసిరావును టీడీపీ నేతలు మంగళవారం నిలదీశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా యానిమేటర్లుతో రాజకీయ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోందని టీడీపీ నేత టేకుమూడి లక్ష్మణ రావు ఆరోపించారు. చేయూత మార్ట్‌లో పెట్టుబడిదారులు మహిళలకు తెలియకుండా సమాశాలు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఏపీఎం చేస్తున్న సంఘటనలపై ఎలక్షన్ కమీషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీనేతలు ధూళిపూడి వెంకటరమణ, మందాల గంగసూర్యనారాయణ, నిమ్మకాయల సత్యనారాయణమూర్తి, గంజా సూరిబాబు, వాసంశెట్టి శ్రీనివాసరావు, వడ్లమూరి సతీష్, జక్కుల ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

రెండోరోజు టెక్నికల్, బ్రేక్ టెస్టులు

గండేపల్లి, ఏప్రిల్ 2: సూరంపాలెం ఆదిత్య ప్రాంగణంలో ఆదిత్య యూనివర్శిటీ మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు నాలుగు రోజులపాటు జాతీయస్థాయి ప్రో-కార్టింగ్ ఎండురెన్స్ చాంపియన్‌షిప్-2024 సీజన్-4 పోటీల్లో రాష్ట్ర నలుమూలల నుంచి కాకుండా చెన్నై, కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన కళాశాలల నుంచి 13 టీమ్‌లకు సంబంధించిన 350మంది సభ్యులు తమ తమ పనులతో బిజీబిజీగా ఉన్నారు. రెండోరోజు మంగళవారం టెక్నికల్ టెస్ట్, బ్రేక్‌టెస్ట్‌లను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ డోలా సంజయ్, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, కోఆర్డినేటర్లు డాక్టర్ శరవణన్, డాక్టర్ భీమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

14 వరకు కొత్త ఓటర్లు నమోదు: ఆర్వో

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 2: కొత్త ఓటర్ల నమోదుకు ఏప్రిల్ 14వ తేదీ వరకు అవకాశం ఉందని కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు వెల్లడించారు. ఫారం-6 ద్వారా ఆన్‌లైన్‌లోగానీ, ఆయా సచివాలయాల్లోనిగాని నూతన ఓట్లను నమో దు చేసుకోవచ్చన్నారు. మంగళవారం రాజకీయపార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించి ఇప్పటివరకు జరిగిన ప్రగతిని ఆయన ఆయా రాజకీయపార్టీల ప్రతినిధులకు వివరించారు. ఆర్వో వెంకటరావు మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతీఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలన్నదే ఎన్నికల కమిషన్ లక్ష్యమన్నారు. ఫారం-8 ద్వారా మార్పులు, చేర్పులు చేసుకుంటే ఓటర్ల తుదిజాబితాలో ఉంటాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రావూరి వెంకటేశ్వరరావు(వైసీపీ), తుమ్మల రమేష్(టీడీపీ), అప్పారావు(బీఎస్పీ), పలివెల వీరబాబు(సీపీఐ), డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, తహసీల్దార్ దొర, ఎలక్షన్ డీటీ సీతాపతిరావు, డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు పాల్గొన్నారు.

దేశ రక్షణ కోసం ఇండియా కూటమిని గెలిపించాలి

కాకినాడ సిటీ, ఏప్రిల్ 2 : ప్రజల్లో మత విద్వేషం రెచ్చగొట్టి ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని, దాని కూటమి టీడీపీ, జనసేన, నిరంకుశ వైసీపీలను ఓడించి దేశరక్షణ కోసం ఇండియా కూటమిని గెలిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు పిలుపునిచ్చారు. కాకినాడ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లిపూడి మంగపతి పళ్లంరాజును మంగళవారం సీపీఐ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, కార్యవర్గ సభ్యుడు పి.సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు మల్లిపూడి రాంబాబు, పెద్దాడ సుబ్బారాయుడు, రాజారపు మహేష్, కుక్కల ప తదితరులు పాల్గొన్నారు.